

## 'ఎన్‌కౌంటర్'లకు ప్రభుత్వం స్వస్తి పలకాలి

# అన్ని జిల్లాలలో మానవహక్కుల కోర్టులు నెలకొల్పి, ప్రతి 'ఎన్‌కౌంటర్'పైన నేరవిచారణ జరపాలి

ప్రజలారా!

ఈ సంవత్సరం జనవరి 2 రాత్రి కరీంనగర్ జిల్లా పాలకుర్తిలో జరిగిన హత్యాకాండ ఫలితంగా రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్ల' గురించి మరొకసారి చర్చ చెలరేగింది. అసలు ఎన్‌కౌంటర్ అంటే ఏమిటి? పోలీసులు ఎవరినయినా చంపేసి ఎన్‌కౌంటర్ జరిగిపోయిందంటే ఒప్పుకునే చట్టం ఏదయినా ఉందా? తొమ్మిది మందిని హతమార్చి ఒక్క చిరుగాయం కూడ లేకుండ తప్పించుకున్న పోలీసులు, 'వాళ్ల ముందు కాల్పులు జరిపితే ఆత్మరక్షణ కోసం మేము ఆ తరువాత జరిపాము' అని ప్రకటిస్తే సరిపోతుందా? చంపినవాళ్లే తీర్పు చెప్తారా? చంపినవాళ్లే ఇన్వెస్టిగేట్ చేసి అంతా సక్రమంగా ఉందని ప్రకటించి కేసు మూసేస్తే న్యాయం జరిగినట్టేనా? Nobody shall be judge in his own cause అని న్యాయశాస్త్రం చెప్తుంది. ఇది ప్రజాతంత్ర న్యాయవ్యవస్థ ఎక్కడయినా ఎప్పుడయినా అనురించవలసిన ఒక ప్రాథమిక సూత్రం. ఒక తగవులో వాది, లేక ప్రతివాది అయిన వ్యక్తి తానే తగవు తీర్చే పంచాయితీలో కూర్చోవడానికి వీలులేదని న్యాయశాస్త్రం చదువుకోని వాళ్లకుకూడ తెలుసు. కానీ పోలీసు అత్యాచారాల విషయంలో పోలీసులే ముద్దాయిలు, వారే నేర పరిశోధకులు, వారే న్యాయమూర్తులు అయ్యారు. ఇదొక నాగరిక సమాజం ఆమోదించవలసిన పద్ధతేనా?

పాలకుర్తిలో నలుగురు నక్సలైట్ దళ సభ్యులేకాక అయిదుగురు నిరాయుధులయిన గ్రామీణులను కూడ పోలీసులు చంపారని కేంద్ర కార్మిక మంత్రితో మొదలుపెట్టి అందరూ బాధ వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం మృతుల కుటుంబాలకు లక్షరూపాయలు ఇచ్చింది. కేంద్రకార్మికమంత్రి మృతుల భార్యలకు ఉద్యోగాలు ఇప్పించాడు. అంతా బాగానే ఉంది కానీ, ఆ ఘోరమైన హత్యకు పాల్పడిన పోలీసులను శిక్షించే ప్రతిపాదన మాత్రం ఏ ప్రభుత్వమూ చేయలేదు. మొదట నిజంగానే ఎదురు కాల్పులు జరిగాయని కొద్దిసేపు అనుకున్నా, తొమ్మిది మందిలో నలుగురు మాత్రమే అక్కడికక్కడ చనిపోయారు. మిగిలిన అయిదుగురిని పోలీసులు ఆ తరువాత (అంటే తక్కిన దళ సభ్యులు గ్రామం నుండి వెళ్లిపోయిన తరువాత, ఇంక ఎదురుకాల్పులు జరిగే అవకాశం అంతరించిపోయిన తరువాత) కాల్చిచంపారు. ఇది హత్యేకదా? అసలు మొదట కూడ ఎదురుకాల్పులు జరగలేదని నక్సలైట్లు కాల్పులే జరపలేదనీ పాలకుర్తి గ్రామస్తులు ముక్తకంఠంతో అంటున్నారు. మరి ఈ నేరాలకు పరిహారం డబ్బు, ఉద్యోగాలు మాత్రమేనా? నేరస్తులను శిక్షించకుండ న్యాయం జరిగినట్టేనా?

నిజానికి పాలకుర్తి విలక్షణమయిన ఘటన కాదు. 'ఎన్‌కౌంటర్ల' పేరిట పోలీసులు చేసే హత్యలలో నిరాయుధులయిన గ్రామీణులు చనిపోవడం ఇది మొదటిసారి కాదు. ఆఖరిసారీకాబోదు. పాలకుర్తి ఘటనకు మూడురోజులు తరువాత (జనవరి 5 నాడు) అదే కరీంనగర్ జిల్లాలోని బీర్పూర్ గ్రామానికి చెందిన వొల్లాల నారాయణ అనే భూమిలేని గౌడ కులస్తుడు సారంగాపూర్ దారిలోని ఘాట్‌రోడ్డు పక్కన కట్టెలమోపు కట్టుకుంటుండగా, నాటుసారాయి దండిగా తాగిన పోలీసులు మోటార్ సైకిల్‌పైన వచ్చి (మోపులోని కట్టెలు తుపాకులలాగ కనబడ్డాయేమో) నేరుగా అతనిని కాల్చి చంపారు. పాలకుర్తి ఘటనకంటె మూడు వారాలు ముందు (1995 డిసెంబర్ 9నాడు) వరంగల్ జిల్లా రామకృష్ణాపురంలో నక్సలైట్లు ఉన్న ఇంటిపైన, పక్కింటిపైన, పోలీసులు విచ్చలవిడిగా జరిపిన కాల్పులలో వేల్పుల స్వరూప, వేల్పుల కొమురమ్మ అనే గృహిణులు చనిపోయారు. ఇంకా వెనక్కిపోతే ఇటువంటి సంఘటనలు అనేకం జరిగాయి. 1994 నవంబర్ 26 తేదినాడు కరీంనగర్ జిల్లాలోని లెంకలగడ్డ దగ్గర నక్సలైట్లు మందుపాతర పేల్చి కొందరు పంజాబ్ కమాండోలను, మహదేవ్‌పూర్ ఎస్ఐని చంపగా, ప్రాణాలు దక్కించుకున్న పోలీసులు అక్కడే మాటువేసి ఒక గంట తరువాత ఆ దారిన పోతున్న చెన్నూరు మల్లయ్య అనే 70 సంవత్సరాల దళితుడిని కాల్చి చంపారు. 1993 ఏప్రిల్ 4న వరంగల్ జిల్లా కాలువపల్లిలో ఒక కుటుంబ తగాదా తీర్చడానికి పంచాయితీ నిర్వహిస్తున్న నక్సలైట్ దళంమీద, కూర్చున్న ప్రజలమీద పోలీసులు కాల్పులు జరిపి భీముని గట్టయ్య అనే గిరిజన రైతును చంపారు. 1992 ఏప్రిల్ 1వ తేదీన గుంటూరు పోలీసులు ఏక్‌నాంపేట దగ్గర కృష్ణానదికి అవతల జాలర్లతో కలిసి ఉన్న దళసభ్యులపైన ఏకబిగిన కాల్పులు జరిపి ముగ్గురు దళసభ్యులతోపాటు నలుగురు జాలర్లను కూడ హతమార్చారు. 1992 మార్చి 24 నాడు శ్రీకాకుళం జిల్లాలోని రట్టి గ్రామం దగ్గర పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు జీపులో ఒక తుపాకి అకస్మాత్తుగా పేలి కాశీబుగ్గ ఎస్ఐ చనిపోగా, కేవలం ఆ నిర్లక్ష్యాన్ని కప్పిపెట్టుకోవడానికి పోలీసులు ఇద్దరు గ్రామస్తులను ఇళ్లనుండి లేపి తీసుకుపోయి కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌లో ఇటు ఎస్ఐ, అటు ఇద్దరు నక్సలైట్లు చనిపోయారని ప్రకటించారు. 1991 సెప్టెంబర్ 7న తూర్పు గోదావరి జిల్లా మోహనాపురం గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో నక్సలైట్ దళసభ్యులు టీచర్లతో మాట్లాడుతుండగా, ప్రహరీగోడకు ఆవలినుండి పోలీసులు నేరుగా కాల్పులు జరిపి దళం సెంట్రీతోబాటు ఇద్దరు పసిపిల్లలను కూడ కాల్చి చంపారు. 1991 మేనెల 21న ఖమ్మంజిల్లా కృష్ణసాగర్‌లో నక్సలైట్లు నిర్వహిస్తున్న బహిరంగ సమావేశం మీదికి పోలీసులు విచ్చలవిడిగా కాల్పులు జరిపి కృష్ణకుమారి అనే ఇంటర్ విద్యార్థినిని చంపారు.

కాబట్టి 'ఎన్‌కౌంటర్'లలో నక్సలైట్లతో ఏ సంబంధంలేని నిరాయుధులైన సామాన్య గ్రామీణ ప్రజానీకం గాయపడడం, చనిపోవడం, ఇది మొదటిసారికాదు. ఎంతోకొంత సంబంధం ఉన్నప్పటికీ గ్రామంలో ఉంటూ కూలిచేసుకొని పొట్టపోసుకుంటున్న యువకులను పోలీసులు ఇంటినుండి లేపి తీసుకొనిపోయి కాల్చి చంపిన ఉదంతాలకయితే లెక్కేలేదు. వాటిని ఒక్కొక్కటిగా పేర్కొనాలంటే ఇటువంటి కరపత్రాలు పదికూడ చాలవు. 'ఎన్‌కౌంటర్ల' పేరిట జరిగే హత్యలలో అధికభాగం ఈ కోవకు చెందినవే.

**16-2-96 శుక్రవారం ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 4 గం॥ల వరకు విశాఖపట్నం కలక్టర్ ఆఫీసు వద్ద జరుగు పౌరహక్కుల సంఘం ధర్నాను జయప్రదంచేయండి**

## అయితే సాయుధ విప్లవకారులను కాల్చిచంపవచ్చా ?

ఈ ప్రశ్న గురించి ఆలోచించమని మేము ప్రజలను కోరుతున్నాం. పాలకుర్తిలో గ్రామీణ ప్రజలు చనిపోకుండ దళసభ్యులు మాత్రమే చనిపోయివుంటే అది అన్యాయం కాకపోయి ఉండేదా? పోలీసులు చేసిన చర్య నేరం కాకపోయి ఉండేదా? సాయుధులైన విప్లవకారులనైనా సరే, నేరుగా కాల్చి చంపే అధికారం పోలీసులకు ఉందా?

ఉందనే చాలామంది అనుకుంటున్నారు కాబట్టి ఈ విషయాన్ని కొంత వివరించవలసి ఉందని మేము భావిస్తున్నాము. విప్లవకారులు ఆయుధాలు పట్టుకున్నారు కాబట్టి, సాయుధపోరాట రాజకీయాలు ఆచరిస్తారు కాబట్టి, వాళ్లను పోలీసులు కాల్చిపారేయవచ్చని వాదించే వాళ్లు చాలామందే ఉన్నారు. ఇది చట్టవిరుద్ధమైన వాదన. ఏ వ్యక్తయినా తాను చేసిన నేరానికి మాత్రమే బాధ్యుడు. ఆ నేరం కోర్టులో రుజువు కావాలి. శిక్ష కోర్టు వేయాలి. అంతే తప్ప సాయుధ పోరాట రాజకీయాలు నమ్మే విప్లవకారులు ఎక్కడ కనబడితే అక్కడ కాల్చిపారేయవచ్చునని చట్టంలో ఎక్కడాలేదు. వాళ్లు ఏదయినా కేసులో నిందితులైనట్టయితే వారిని అదుపులోకి తీసుకొనే అధికారం మాత్రమే పోలీసులకు ఉంది. పాలకుర్తి హత్యాకాండతో చెలరేగిన సంచలనం చల్లారకముందే, జనవరి 9 తెల్లవారుజామున వరంగల్ జిల్లాలోని ఆత్రేపల్లి సమీపంలోని అడవి ప్రాంతంలో, అప్పుడే నిద్రలేస్తున్న దళసభ్యులపైన పోలీసులు నేరుగా దాడిచేసి అయిదుగురిని చంపారు. వారిలో

నలుగురు నిద్రలోనే చనిపోయినట్టున్నారు. పాలకుర్తి ఘటన ఎంతఘోరమైన హత్యో ఇదీ అంతే ఘోరమైన హత్య.

'మేము వాళ్లను లొంగిపొమ్మంటే లొంగిపోకుండ మామీద కాల్పులు జరిపారు. మేము ఆత్మరక్షణకోసం ఎదురు కాల్పులు జరిపాము' అని పోలీసులు అంటుంటారు. ఇది నిజమా అబద్ధమా అనేది కోర్టులో రుజువు కావాలి. పోలీసులు ఏకపక్షంగా ప్రకటించి కేసు మూసేయడానికి వీలులేదు. ప్రాణాపాయం ఏర్పడితే ఆత్మరక్షణ చేసుకునే హక్కు చట్టంలో ఉంది. అది నిజానికి ఒక సహజమైన హక్కు. అయితే ఆత్మరక్షణలో ఎదుటి వ్యక్తి ప్రాణంతీయడానికి, ఉద్దేశ్యపూర్వకంగా తీయడానికి చాలా తేడా ఉంది. ఈ రెండింటిలో ఏది జరిగిందనేది కోర్టులో రుజువు కావాలి. హత్యచేస్తే అది ప్రాథమికంగా హత్యే అవుతుంది. ఆత్మరక్షణ కోసం అవసరం అయిందని కోర్టు నమ్మితేనే అప్పుడు ముద్దాయికి హత్యానేరం నుండి విముక్తి లభిస్తుంది. కోర్టుకు ఆ నమ్మకం కలిగించే బాధ్యత ముద్దాయిదే.

అందుకే, ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నది సాయుధ నక్సలైట్లా లేక నిరాయుధ గ్రామీణులా అనే చర్చతో సంబంధం లేకుండ అన్ని ఎన్‌కౌంటర్ ఘటనలపైన హత్యకేసు నమోదుచేసి, ఆత్మరక్షణ చేసుకునే క్రమంలోనే జరిగిందని రుజువు చేసుకునే బాధ్యత ముద్దాయిలయిన పోలీసులపైన పెట్టాలని పౌరహక్కుల ఉద్యమం రెండు దశాబ్దాలకుపైగా అంటున్నది. కోర్టు లోపల, బయట వాదిస్తూ ఉంది. 1995లో మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు దీనిని సూత్రప్రాయంగా ఆమోదించింది. హైదరాబాద్ నడిబొడ్డున 1995 జులై 26న పోలీసులు తరిమి వెనుకనుండి కాల్చి చంపిన సిపిఐ (ఎం.ఎల్) నాయకుడు మధుసూదన్‌రాజ్ కేసులో హైకోర్టు మావాదనతో ఏకీభవించి, ఆయనను చంపిన పోలీసులపైన కేసు నమోదుచేసి చార్జిషీటు దాఖలు చేయవలసిందిగా సిబిఐని ఆదేశించింది. ఈ ఆదేశాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. చనిపోయిన వ్యక్తి సాయుధ విప్లవపార్టీ నాయకుడు కాబట్టి, అతని పార్టీ సభ్యులు అనేక హత్యలు చేసారు కాబట్టి, చంపింది పోలీసులు కాబట్టి, పోలీసుల మాటను తప్పనిసరిగా సత్యంగా స్వీకరించాలనీ, దానిపైన కోర్టు విచారణకు తావులేదని ప్రభుత్వం వాదన. ఇంతదారుణమైన వాదనను సుప్రీంకోర్టు ఆమోదిస్తుందా, లేక రాజ్యాంగ ప్రాథమిక హక్కులను కాపాడుతుందా అనేది చూడాలి. కోర్టులు ప్రజాభిప్రాయానికి అతీతంగా పనిచేయవు కాబట్టి జీవించేహక్కును అభాసుపాలు చేసే ఈ వాదనను స్వీకరించవద్దని ప్రజలవైపునుండి సుప్రీంకోర్టుపైన బలంగా ఒత్తిడి పెట్టవలసి ఉంది.

## 'ఎన్‌కౌంటర్లు ఇకమీదట జరగవు'

ఈ రకమైన ప్రకటనలు ఈ మధ్యకాలంలో ప్రభుత్వనాయకులు అప్పుడప్పుడు ఇస్తున్నారు. 1989 చివరిలో అధికారాని వచ్చిన మర్రి చెన్నారెడ్డి ఈ హామీ ఇచ్చాడు. ఒక రకంగా ఈ ప్రకటనే విచిత్రమైనది. 'ఇక మీదట ప్రభుత్వ కార్యాలయాలలో లంచాలు అడగరు' అనో, 'ఇకమీదట ఎన్నికలలో మేము దొంగవోట్లు వేసుకోము' అనో అన్నట్టుంది. ఏమైతేనేం, ఒక ఘోరమైన నేర చరిత్రను గుర్తించడం ముదావహం. కానీ ఈ పశ్చాత్తాపం కొంత కాలమే నిలిచింది. ఆ తరువాత ఎన్‌కౌంటర్లు మళ్లీ మొదలై అపూర్వ పరిమాణంలో జరిగాయి. అయిదు సంవత్సరాల కాంగ్రెస్‌పాలనలో 623 మంది ఎన్‌కౌంటర్ల పేరిట చంపబడ్డారు.

1994 చివరిలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. వచ్చీరాగానే ఎన్టీరామారావు 'ఇకమీదట ఎన్‌కౌంటర్లు జరగవు' అనీ, తమ ప్రభుత్వం పౌరహక్కులను గౌరవిస్తుందనీ పదేపదే ప్రకటించాడు. ఆయన మొదటి ప్రకటన రాగానే కరీంనగర్ జిల్లాలో పోలీసులు రెండు రోజులలో ఇద్దరిని హతమార్చారు. ఆ తరువాత ఎన్‌కౌంటర్లు కొనసాగాయి. ఎన్టీరామారావును గద్దెదించి అధికారానికి వచ్చిన చంద్రబాబునాయుడు కూడ 'ఎన్‌కౌంటర్లు ఇకమీదట ఉండవు' అనీ 'మేము ప్రజల పౌరహక్కులను గౌరవిస్తాం' అనీ అన్నాడు. కానీ ఎన్‌కౌంటర్లు సాగుతూనే ఉన్నాయి. మామా అల్లుళ్ల పాలనలో ఇప్పటికి 85 మంది చనిపోయారు.

ఒక అన్యాయం గతంలో జరిగిందని గుర్తించి, ఇకమీదట జరగదని ప్రకటించిన పాలకులు కనీసం తమ ప్రకటనను నిలబెట్టుకోవాలి కదా? నిలబెట్టుకోకపోతే ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనుకోవాలా, లేకపోతే పోలీసులమీద అజమాయిషీ పోయిందనుకోవాలా? రెండింటిలో ఒకటి సత్యం అయి ఉండాలి. ఏది సత్యమో రాష్ట్రాన్ని ఏలే వాళ్లే చెప్పాలి.

## 'ఇది సామాజిక ఆర్థిక సమస్య'

ఈ ప్రకటనకూడ మన పాలకులు ఈ మధ్య కాలంలో అప్పుడప్పుడు చేయడం నేర్చుకున్నారు. కానీ ఆచరణలో పెద్దగా తేడా కనబడడం లేదు. విప్లవ పార్టీలకు మూలం రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలలో ఉన్న సామాజిక ఆర్థిక రాజకీయ సమస్యలనీ, ఆ సమస్యలపైన దృష్టికేంద్రీకరించకుండ కేవలం విప్లవకారుల హింస గురించి చర్చపెడితే పరిష్కారం దొరకదనీ పౌరహక్కుల సంస్థలు చాలాకాలంగా చెప్తున్నాయి. ఇది కేవలం మన రాష్ట్రంలోని నక్సలైట్ ఉద్యమానికే కాదు. కాశ్మీర్, పంజాబ్, అస్సాం, నాగాలాండ్, మిజోరం, బీహార్ తదితర రాష్ట్రాలలోని సాయుధ తిరుగుబాట్లన్నిటికీ వర్తిస్తుంది. ఈ పోరాటాల పంథాలు, రాజకీయాలు సరైనవా, కావా అని పౌరహక్కుల సంఘాలు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు. కానీ అన్నిటికీ మూలం సమాజంలో ఉందనీ, ఆ మూలాన్ని పరిష్కరించాలనీ అంటున్నాయి. ఆ పోరాటకారుల హింసను న్యాయసమ్మతమైన పద్ధతులలో ఎదుర్కుంటూనే, దానికి మూలమైన సమస్యలను పరిష్కరించాలని పౌరహక్కుల సంఘాలు చెప్తున్నాయి.

చాలాకాలం ఈ ఆలోచనను పెడచెవిన పెట్టిన పాలకులు ఈ మధ్య 'మేము కూడ ఈ విషయాన్ని గుర్తిస్తున్నాం' అనడం నేర్చుకున్నారు. 1989లో చెన్నారెడ్డి ఈ విధాన ప్రకటన చేయడమేకాక, నక్సలైట్ ఉద్యమానికి మూలకారణమైన పరిస్థితులేమిటో విశ్లేషించమని ఒక కేబినెట్ సబ్‌కమిటీని వేసాడు. కానీ ఆ విధానం నిలువలేదు. ఆచరణలో అణచివేతే ఏకైక విధానం అయింది. 1994 డిసెంబర్‌లో అధికారానికి వచ్చిన ఎన్టీఆర్, ఆయన తరువాత వచ్చిన చంద్రబాబునాయుడు అదే ధోరణిలో మాట్లాడారు. కానీ అమలు అవుతున్నది శూన్యం. విప్లవ పార్టీలకు ప్రజలలో విస్తారంగా మద్దతు ఉందని (ఎవరికి ఇష్టమున్నా లేకున్నా) గుర్తించడానికి మనపాలకులు నిరాకరిస్తున్నారు. వాళ్లను కేవలం ఆయుధాలు పట్టుకున్న దుండగులుగా చిత్రీకరిస్తారు. 'ఆయుధాలు ఎందుకు పట్టుకుంటారు? ప్రజలలో వచ్చి పనిచేయండి' అని తరచుగా సవాలు చేస్తుంటారు. కానీ వాళ్లు ప్రజలతో కూర్చొని సమావేశమయినప్పుడు సహితం వారిమీద, వారితో ఉన్న ప్రజలమీద కాల్పులు జరపడానికి ఈ ప్రభుత్వాలు వెనుకాడలేదు.

రాజకీయ ఉద్యమాలపట్ల, ప్రజా ఉద్యమాలపట్ల ప్రజాస్వామికంగా వ్యవహరించే విషయంలో మన పాలకులకు చిత్తశుద్ధి లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించే విధానం వారికి లేదు. ఒత్తిడులు వచ్చినప్పుడు ఇందుకు భిన్నంగా మాట్లాడినా, ఆచరణలో మాత్రం అణచివేత తప్ప వారికి వేరే విధానం లేదు. అందులో భాగమే పాలకుర్తి ఎన్‌కౌంటర్ వంటి ఘోరమైన ఘటనలు.

- ఉద్యమాలపట్ల రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత విధానాన్ని విడనాడాలి.
- ఉద్యమాలు ముందుకు తీసుకొస్తున్న ప్రజా సమస్యలకు పరిష్కారం చూపించాలి.
- 'ఎన్‌కౌంటర్' విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకాలి.
- ప్రతీ జిల్లాలోనూ మానవహక్కుల కోర్టు నెలకొల్పి, 'ఎన్‌కౌంటర్'లకు బాధ్యులైన పోలీసులపైన కేసులు పెట్టి విచారించాలి.
- ఎన్‌కౌంటర్లలో తమవారిని కోల్పోయిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC)

31 జనవరి 1996